క్లుప్తంగా

15 లోపు దరఖాస్తు చేసుకోండి

పెదపూడి: దీపావళి సందర్భంగా బాణసంచా షాపుల లైసెన్సుల కోసం ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ పీవీ సీతాపతిరావు సోమవారం తెలిపారు. నిర్వాహకులు నిబంధనలను పాటించి షాపులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉల్లంఘించిన వారి లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

అన్న సమారాధన

సీతానగరం: సింగవరం పంచాయతీ పరిధి నాగరత్న కాలనీలోని కనక దుర్గమ్మ ఆలయం వద్ద సోమవారం అన్న సమారాధన నిర్వహించారు. దేవీ నవరాత్ర ఉత్సవాల అనంతరం గ్రామస్తుల సహాయ సహకారాలతో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సుమారు ఐదు వేల మంది భక్తులు తరలివచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు.

ఉపాధి పనుల గుర్తింపు



మాట్లాడుతున్న ఏపీవో సత్యవతి

సీతానగరం: మండలంలోని ఇనుగంటివారిపేటలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంలో పలు పనులు గుర్తించారు. ఏపీవో సత్యవతి మాట్లాడుతూ లేబర్ బడ్జెట్ అనుగుణంగా 25 కాలువ పూడికతీత పనులు, రెండు వ్యవసాయ సేంద్రియ నీటి గుంటలు, ఐదు కంపోస్ట్ పిట్స్ గుర్తించామన్నారు. జాబ్ కార్డులు ఉన్నవారు తప్పని సరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ-2 సత్యం మదన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై పిచ్చికుక్క దాడి

సీతానగరం: మండలంలోని వంగలపూడిలో సోమవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేసింది. దీని దాడిలో ముగ్గురు గాయపడ్డారు. వారికి సీతానగరం పీహెచ్‌సీలో యాంటీ ర్యాబిస్ ఇంజెక్షన్లు ఇచ్చి, మెరుగైన వైద్యసేవల కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

అనపర్తి: తమ న్యాయమైన కోర్కెల సాధనకు విజయవాడలో డాక్టర్లు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 9వ రోజుకు చేరాయి. మండలంలోని కుతుకులూరు, రామవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన వైద్యులు ప్రియాంక, దుర్గాప్రసాద్, మీనాక్షి ఈ దీక్షలలో పాల్గొన్నారు. పీజీ ఇన్ సర్వీస్ కోటాను అమలు చేయాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, టైమ్ బౌండ్ ప్రమోషన్లు అమలు చేయాలని, గిరిజన ప్రాంతాల భత్యాలు అందించాలని, సంచార చికిత్స కార్యక్రమ భత్యం మంజూరు చేయాలనే డిమాండ్లతో ఈ నిరసన చేపట్టారు.

రుణాలు చెల్లించిన రైతులకు ఊరట

సీతానగరం: వెదుళ్లపల్లి సహకారం సంఘంలో జరిగిన రూ.1.34 కోట్ల అవినీతిలో 32 మంది బాధిత రైతులకు ఊరట కలిగింది. ఆ పీఏసీఎస్ సీఈవో ఎం.శివరామకుమారి (సంధ్య) అధ్యక్షతన సోమవారం జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో అసిసెంట్ రిజిస్ట్రార్లు కృష్ణ మోహన్, కె.సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు సంఘంలో జరిగిన అవినీతిపై విచారణ ఎంత వరకు వచ్చిందని ప్రశ్నించారు. సొసైటీలో అవినీతి జరిగితే చెల్లించిన రుణాలు మళ్లీ చెల్లించడం ఏమిటని నిలదీశారు. దీనిపై స్పందించిన అధికారులు మాట్లాడుతూ రసీదులు ఉన్న రైతులు రుణాలు చెల్లించనవసరం లేదన్నారు.

మహిళా కబడ్డీ జట్టు ఎంపిక


అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా కబడ్డీ పోటీలకు ఎంపికైన 'నన్నయ' జట్టు

పెదపూడి: తమిళనాడులోని సేలంలో ఈ నెల 29 నుంచి జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా కబడ్డీ పోటీల్లో పాల్గొన్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం జట్టును ఎంపిక చేశారు. పెదపూడి మండలం జి.మామిడాడలోని డీఎల్ రెడ్డి డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన జట్టులోని క్రీడాకారుల నుద్దేశించి వర్సిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ పి.విజయ నిర్మల మాట్లాడుతూ, ఉత్తమ ప్రతిభతో విజయం సాధించి, విశ్వవిద్యాలయానికి జాతీయ స్థాయి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. స్థానిక ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ సబ్బెళ్ల శివన్నారాయణ రెడ్డి మాట్లాడుతూ, వర్సిటీ పరిధిలోని ఉభయ గోదావరి జిల్లాల నుంచి వచ్చిన 150 మంది క్రీడాకారుల నుంచి 14 మందితో కూడిన జట్టును ఎంపిక చేశారన్నారు. ఎంపిక పోటీల పరిశీలకురాలిగా జి.ప్రమీలారాణి, ఎంపిక కమిటీ సభ్యులుగా వై.సుధారాణి, ఎం.వీరబాబు వ్యవహరించారు. కార్యక్రమంలో అంతర్జాతీయ కబడ్డీ కోచ్ పీవీఎస్‌వీ సాయిప్రసాద్, జి.మామిడాడ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ, కరస్పాండెంట్ డీఆర్‌కే రెడ్డి, అధ్యక్షుడు మేడపాటి రామచంద్రారెడ్డి, డీఎల్ రెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్ రెడ్డి, పీడీ సూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై మహాగ్రహం


నకిలీ మద్యంపై రంగంపేటలో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, పార్టీ శ్రేణులు


ఎక్సైజ్ సీఐ సుధకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

- రంగంపేటలో కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- కూటమి ప్రభుత్వ తీరుపై నిరసన
- కుంభకోణంపై సీబీఐ విచారణ జరపాలని మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి డిమాండ్

రంగంపేట: నకిలీ మద్యం కుంభకోణంపై సీబీఐ విచారణ జరిపించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. నకిలీ మద్యానికి వ్యతిరేకంగా సోమవారం సాయంత్రం రంగంపేటలో భారీ ర్యాలీ, నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సుధకు డిమాండ్ పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నకిలీ మద్యం తయారీని పరిశ్రమలా మార్చి రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలు హరిస్తున్న టీడీపీ నాయకుల వైఖరిపై మండిపడ్డారు. అనపర్తి నియోజకవర్గంలో ఎక్కడ చూసినా మద్యం ఏరులై పారుతోందని, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ వస్తోందని తాను ముందే హెచ్చరించడం జరిగిందన్నారు. కానీ ఆ సమయంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తన అనుచరులతో ప్రెస్‌మీట్ పెట్టించి కప్పిపుచ్చే ప్రయత్నం చేశారన్నారు. ఇప్పుడు రాష్ట్రం నలుమూలల కల్తీ మద్యం తయారవుతూ అన్ని ప్రాంతాలకు సరఫరా అవుతోందన్నారు.

విచ్చలవిడిగా బెల్టు షాపులు

మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో బెల్టు షాపులు విచ్చలవిడిగా పెరిగిపోయాయన్నారు. వీటి వెనుక స్థానిక బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హస్తం ఉందని ఆరోపించారు. ఈ విషయంపై తాను ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసినా, ఇప్పటివరకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. నకిలీ మద్యం కారణంగా అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. చాలామంది లివర్, ప్యాంక్రియాస్ సమస్యలతో బాధపడుతున్నారన్నారు. దీనిపై ప్రతి ఇంటికి వైద్య సిబ్బందిని పంపించి సర్వే చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నకిలీ మద్యంతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వారి ప్రాణాలతో కూటమిలోని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఆటలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిలీ మద్యం వ్యాపారాన్ని తక్షణమే అరికట్టాలని, బెల్టు షాపులను మూసి వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, పార్టీ అనపర్తి నియోజకవర్గ అబ్జర్వర్ గుబ్బల తులసీ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పంచాయతీ విభాగం జిల్లా అధ్యక్షుడు పాలాటి నాగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు అడబాల వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ పోతుల బులి వీర్రాజు, కల్చరల్ విభాగం జిల్లా అధ్యక్షుడు కుసుమంచి కృష్ణంరాజు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

కాపవరంలో నేడు నిరసన


జక్కంపూడి విజయలక్ష్మి

కోరుకొండ: నకిలీ మద్యాన్ని అరికట్టి, ప్రజల ఆరోగ్యాలను సంరక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కోరుకొండ మండలం కాపవరంలోని ఎక్సైజ్ సీఐ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ అమలాపురం పార్లమెంటరీ అబ్జర్వర్ జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ ధర్నాలో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ పాల్గొనాలన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని కుటీర పరిశ్రమలా నిర్వహిస్తోందన్నారు.

నేడు సన్నాహక సమావేశం

అనపర్తి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన రెడ్డి రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు, వైద్య విద్యను చేరువ చేయాలన్న సదుద్దేశంతో ప్రారంభించిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయబోతోందని మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. దానికి వ్యతిరేకంగా జగన్ ఆదేశాల మేరకు చేపట్టనున్న కోటి సంతకాల సేకరణపై మంగళవారం అనపర్తి పార్టీ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు తేజశ్రీ ఎంపిక



బిక్కవోలు: పందలపాకలోని పడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పసగడుగుల తేజశ్రీ అండర్ - 19 రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ గొల్లల మామిడాడలో జీఆర్ఎస్ఏ ఫ్యామిలీ హెల్త్ క్లబ్‌లో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్ - 19 బాలికల పోటీల్లో తేజశ్రీ ఉత్తమ ప్రతిభ కనబరించిందన్నారు. తద్వారా త్వరలో జరిగే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరఫున పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా తేజశ్రీతో పాటు పీడీ ద్వారంపూడి యువరాజారెడ్డిని అభినందించారు. కార్యక్రమంలోని పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కొనాల సత్తిరాజు, నూతన పీడీ ద్వారంపూడి రామనాగ భీమేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎండు తెగులు నివారణకు చర్యలు చేపట్టాలి


చినకొండేపూడిలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీనివాసరావు తదితరులు

సీతానగరం: వరి పంటలో బ్యాక్టీరియా ఎండు తెగులు నివారణకు రైతులు సత్వరమే చర్యలు చేపట్టాలని మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాసరావు రైతులకు సూచించారు. ఆయన సోమవారం చిన కొండేపూడిలోని పొలాలను శాస్త్రవేత్త శ్రీనివాసరావు, డీఆర్‌సీ, ఏడీవో జయరామలక్ష్మి, ఏవో గౌరీదేవి, రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం చినకొండేపూడి రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. నత్రజని అధికంగా వాడడం వల్ల ఈ తెగులు త్వరగా వ్యాప్తి చెందుతుందన్నారు. తెగులు సోకిన మడిలోని నీటిని తెగులు సోకని మడిలోకి పారించడం ద్వారా కూడా ఈ తెగులు ఆశిస్తుందన్నారు. దీని నివారణకు ఎటువంటి రసాయన మందుల లేవన్నారు. ఈ తెగులు రాకముందు నత్రజని తగినంత వరకు మాత్రమే వాడాలన్నారు. అలాగే పోటాష్ ఎరువులను ఎకరానికి 40 కిలోలు చొప్పున రెండు దఫాలుగా అంటే చివరి దమ్ములో 20 కిలోలు, చిరుపొట్ట దశలో 20 కిలోలు వాడాలన్నారు. కార్యక్రమంలో రైతులు, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై ఎనిమిది అర్జీలు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు ఎనిమిది అర్జీలు వచ్చాయని ఎంపీడీవో ఎం.భారతి తెలిపారు. కార్యక్రమంలో ఏవో సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ గోపాల్, వివిధశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం


కస్తూర్బా గాంధీ ఆశ్రమం వద్ద నినాదాలు చేస్తున్న ప్రముఖులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ కె.శైలజారాణి ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆడపిల్లలను రక్షిద్దాం అనే అంశంపై ఆడపిల్లలకు, వారి తల్లిదండ్రులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఎం.సుధామయి, ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, పీహెచ్ఎన్ కె.ఆదిలక్ష్మి, సూపర్‌వైజర్ కె.సుధాకర్, హెచ్ఏ నందీశ్వరరావు, ఏఎస్ఎం కె.శారద, ఆశావర్కర్లు దేవి, జ్యోతి పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠోత్సవం


బలభద్రపురంలో ప్రతిష్ఠించిన ద్వాదశ లింగాలు


శాంతి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

బిక్కవోలు: బలభద్రపురంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో ద్వాదశ జ్యోతిర్లింగ సహిత అష్టాదశ శక్తి పీఠ దేవతా సహిత పరివార దేవతా విగ్రహాల మహా ప్రతిష్ఠను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు మిక్కిలి దుర్గయ్య శాస్త్రి ఆధ్వర్యంలో మహాంకాళి వెంకట రామాశాస్త్రి బ్రహ్మత్వంలో ప్రతి రోజు 41 మంది దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సోమవారం ఉదయం 8.56 గంటలకు ద్వాదశ జ్యోతిర్లింగ సహిత అష్టాదశ శక్తి పీఠ దేవతా సహిత, విద్యా గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర, కాలభైరవ, జయ విజయ, నందీశ్వర, చండీశ్వర, మేధా దక్షిణామూర్తి, నవగ్రహ విగ్రహాలు, ధ్వజ స్తంభ శిఖరాన్ని ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అలంకరణ చేశారు. స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుడు నల్లమల్లి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కాశీలో మాదిరిగా ఈ ఆలయాన్ని నిర్మించామన్నారు. అనంతరం భక్తులకు అన్న సమారధన జరిపారు.

ఎదురెదురుగా ఢీకొన్న కార్లు


ప్రమాదంలో దెబ్బతిన్న కార్లు

రంగంపేట: రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదంపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న కారు, రాజమహేంద్రవరం వైపు నుంచి కాకినాడ వైపు వెళుతున్న మరో కారు ఆదివారం రంగంపేట పోలీస్ స్టేషన్‌కు సమీపంలో ఏడీబీ రోడ్డుపై ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. మరో కారులోని బెలూన్లు ఓపెన్ కావడంతో అందులోని వారికి స్వల్ప గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించారు. కార్లు ముందు భాగాలు నుజ్జునుజ్జు అయ్యాయి. రెండు కార్లు రోడ్డుకు అడ్డుగా ఉండటంతో ఏడీబీ రోడ్డుపై భారీగా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

వెలమ జాతి ముద్దు బిడ్డ అప్పారావు


అప్పారావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సంఘ నాయకులు

బిక్కవోలు: వెలమ జాతి ముద్దు బిడ్డ గొర్రిపాటి బుచ్చి అప్పారావు అని అనపర్తి, మండపేట నియోజకవర్గాల వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రి శ్రీనివాసరావు అన్నారు. పందలపాకలోని వెలమ కమ్యూనిటీ హాలు వద్ద బ్రహ్మనాయుడు వెలమ సంక్షేమ సంఘం అనపర్తి, మండపేట నియోజకవర్గాల ఆధ్వర్యంలో సోమవారం అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ గొర్రిపాటి బుచ్చి అప్పారావు వెనుక బడిన వర్గాలు, రైతులు, కార్మికుల కోసం చేసిన కృషి ఎనలేనిదన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు గెదెల వీరబాబు, నాయకులు యాసలపు శ్రీనువాస్, కర్రి సతీష్, రొంగల శ్రీను, కొల్లి చిన్నారు, కొత్తల త్రిమ్మూర్తులు, కొటాని అప్పారావు పాల్గొన్నారు.

భారీ వర్షం.. జలమయం


రాజానగరంలో ఎస్‌బీఐ ఎదురుగా ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డుపై నిలిచిన ముంపునీరు


కోరుకొండ జంక్షన్‌లో రోడ్డుపై వర్షం నీరు

రాజానగరం: నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలో సోమవారం తెల్లవారుజాము నుంచి సుమారు 4 గంటల పాటు భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో ఏకధాటిగా కురిసిన వర్షంతో జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా స్థానిక స్టేట్ బ్యాంకు ఏరియా పూర్తిగా జలమయమైంది. రాజానగరం - ఫరిజల్లిపేట, కానవరం - తోకాడ, రాధేయపాలెం - శ్రీకృష్ణపట్నం, వెలుగుబంద - నరేంద్రపురం, కలవచర్ల - సీతారామపురం రోడ్లపై ముంపు నీరు కాలువ మాదిరిగా ప్రవహించింది. ఇక పల్లపు ప్రాంతాల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ప్రస్తుతం రాజానగరం మండలంలోని పలు ప్రాంతాలలో ఖరీఫ్ వరి కోతలు జరుగుతున్న క్రమంలో ఈ వర్షం కారణంగా పంట కోతలకు బ్రేకులు పడ్డాయి.

ముంపు నీరు పోయేందుకు దారేది!

స్థానిక స్టేట్ బ్యాంకు ఏరియాలో భారీ వర్షం కురిస్తే చాలు ముంపు నీరు తిష్ట వేస్తోంది. ముఖ్యంగా బ్యాంకు ముందు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డుపై మోకాలు లోతున ముంపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. దీంతో జాతీయ రహదారి నుంచి వైఎస్సార్ జంక్షన్ మీదుగా గ్రామంలోకి వచ్చేందుకు అవకాశం లేక హైస్కూల్ సెంటర్, సూర్యారావుపేట జంక్షన్ నుంచి చుట్టు తిరిగి వాహనచోదకులు ప్రయాణించాల్సి వస్తోంది.

కోరుకొండ: మండలంలో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ కురిసిన భారీ వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. పల్లపు ప్రాంతాలు ముంపు బారిన పడ్డాయి. రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

రామాలయంలో నగల చోరీ


ముకుందవరం రామాలయంలో నగలు లేకుండా ఉన్న విగ్రహాలు

రంగంపేట: ముకుందవరం గ్రామంలోని కాపుల రామాలయంలో నగలు చోరీ అయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు సోమవారం రాత్రి ప్రొబెషనరీ ఎస్సై వై.మురళీకృష్ణ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ముకుందవరంలోని కాపుల రామాలయంలో సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాలు ఉన్నాయి. వాటిపై సుమారు 750 గ్రాముల వెండి కిరీటాలు, సీతమ్మ మెడలో నాలుగు గ్రాముల బంగారు మంగళ సూత్రాలు ఉన్నాయి. అవి సెప్టెంబర్ 9వ వరకూ విగ్రహాలకు ఉండటాన్ని గ్రామస్తులు చూశారు. అనంతరం గ్రామంలోని పబ్బన సిద్ధు, వట్టికూటి గణేష్‌లు భవానీ మాల వేసుకున్నామని, గుడిలో ఉంటామని చెప్పి సంకర కామరాజు నుంచి తాళాలు తీసుకున్నారు. అనంతరం ఈ నెల ఒకటిన కామరాజుకు తాళాలు తిరిగి ఇచ్చేశారు. ఈ క్రమంలో ఈ నెల 9వ తేదీన భజన సమయంలో విగ్రహాలకు వెండి కిరీటాలు, అమ్మవారి బంగారు మంగళ సూత్రాలు లేకపోవడాన్ని భక్తులు గుర్తించారు. ఈ నేపథ్యంలో సోమవారం గ్రామ సర్పంచ్ అయిన వట్టికూటి లక్ష్మీ వెంకన్న బాబు, గ్రామ పెద్దలు కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కొలువుదీరిన కొత్త గురువులు


రంగంపేట హైస్కూల్లో చేరుతున్న ఉపాధ్యాయులు


చంద్రేడు హైస్కూల్లో కొత్త టీచర్లకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు


దొంతమూరు హైస్కూల్లో బాధ్యతలు స్వీకరిస్తున్న రాజశేఖర్


బిక్కవోలులో బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన ఉపాధ్యాయులు

రంగంపేట: డీఎస్సీలో విజయం సాధించిన ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులు సోమవారం ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరారు. వీరికి ప్రధానోపాధ్యాయులు, తోటి ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. విద్యార్థులకు పరిచయం చేశారు. పాఠశాలల్లో విద్యాప్రమాణాల మెరుగుదలకు, విద్యార్థుల ప్రగతికి కృషి చేయాలని సూచించారు.

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు ఉన్నత పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు బాధ్యతలు స్వీకరించారని హెచ్ఎం రమాదేవి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఎస్.గంగా భవాని, షేక్ ఖాజా బాషా, ఎల్.మనోజ్ కుమార్ చేరారన్నారు. వారికి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పడిపూజ


అనిల్ కుమార్, శ్రీదేవి దంపతులను సత్కరిస్తున్న గ్రామస్తులు

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని పెద్ద వీధిలో ఆదివారం రాత్రి అయ్యప్ప స్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 18వ సారి అయ్యప్ప మాలధారణ చేసి శబరిమల వెళుతున్న మీసాల అనిల్ కుమార్, శ్రీదేవి దంపతులను భక్తులు సత్కరించారు. గురుస్వామి తుమ్మూరి వెంకట రమణ ఆధ్వర్యంలో స్వాములు భజనలు, పడి తొక్కారు. కార్యక్రమంలోని మాజీ సర్పంచ్ మీసాల సుబ్బారావు, స్వాములు పందూరి గంగాధర్, యాసలపు రాంబాబు, తుమ్మూరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.